PRGI NO: TGTEL/25/A2356

గురువారం THURSDAY 25.09.2025 | కరీంనగర్ KARIMNAGAR | పేజీలు : 4 pages : 4 | సంపుటి :1 || సంచిక :25 || ధర : 4.00 | చవితి

గురువారం, సూర్యోదయం: 5-45, సూర్యాస్తమయం: 6-44. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు వైశాఖ మాసం కృష్ణ పక్షం తిథి: అమావాస్య రాత్రి 12-36 వరకు. నక్షత్రం: విశాఖ ఉదయం 9-09 వరకు, తదుపరి అనురాధ, వర్జ్యం: పగలు 1-34 నుంచి పగలు 3-20 వరకు, రాహుకాలం: పగలు 3-25 నుంచి సాయంత్రం 5-02 వరకు.దుర్ముహూర్తం: ఉదయం 8-20 నుంచి ఉదయం 9-12 వరకు, పునర్ దుర్ము హూర్తం: రాత్రి 11-05 నుంచి రాత్రి 11-50 వరకు.అమృతకాలం: రాత్రి 12-14 నుంచి రాత్రి 2-01 వరకు.


CIRCULATED AT: WARANGAL, HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA ,ADILABAD, NIZAMABAD, RANGAREDDY, MAHABUBNAGAR, MEDAK

WWW.MEKARTHI DINAPATRIKA.COM

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

# తెలుగు తల్లి ఫ్లై ఓవర్ పేరు మార్పు

## తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్‌గా పేరు మారుస్తూ నిర్ణయం
## కీలక నిర్ణయం తీసుకున్న జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటి



మేకార్తి దినపత్రిక,హైదరాబాద్, సెప్టెంబర్ 24: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ పేరును మార్చాలని నిర్ణయించారు తెలుగు తల్లి ఫ్లై ఓవర్ పేరును తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్‌గా మారుస్తూ స్టాండింగ్ కమిట తీర్మానం చేసింది. మరోవైపు ఫ్లై ఓవర్ కోసం ఆర్చ్‌ను చేస్తోంది జీహెచ్ఎంసీ. బ్రిడ్జికి ఇరువైపులా ఆర్చ్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సచివాలయం వద్ద తీవ్రమై ట్రాఫిక్ సమస్య ఉండేది. దీనిని నియంత్రించేందుకు 1997 లో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సచివాలయం నుంచి లోయర్ ట్యాంక్ బండ్ వరకు నిర్మించిన ఈ బ్రిడ్జ్‌ని 2005లో ప్రారంభించారు. దీనికి తెలుగు తల్లి ఫ్లై ఓవర్ అని నామకరణం చేశారు. అయితే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌ను తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్‌గా మార్చాలని నిర్ణయించారు. ఇదిలాఉంటే.. మేయర్ విజయ లక్ష్మి అధ్యక్షత బుధవారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 14 ఎజెండా అంశ్శా, 10 టేబుల్ ఐటమ్స్‌కు స్టాండింగ్ కమిటీ ఆమెదం తెలిపింది. ఈ అంశాల్లో తెలుగు తల్లి ఫ్లై ఓవర్ పేరు మార్పు కూడా ఉంది.

# ఎవ్వరిని వదిలి పెట్టం

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మేకార్తి దినపత్రిక , హైదరాబాద్ :
నల్గొండ జిల్లాలో యూరియా కోసం ప్రశ్నించిన గిరిజన రైతుపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూరియా కోసం ఆందోళన చేస్తే నడవరాకుండా కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివెనుక ఉన్న ఎవరినీ వదిలిపెట్టమని.. అవసరమైతే మానవ హక్కుల కమిషన్‌కు వెళ్తామని తెలిపారు. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

కరీంనగర్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడానికి రెండు కారణాలు ఉన్నాయని తెలిపారు. అందులో ఒకటి మనం చెప్పుకోలేదని అన్నారు. మనది మనం ప్రచారం చేసుకోలేదని చెప్పారు. ఈ ఓటమిలో మన లోపమే ఉందని.. నాయకుడి లోపం లేదని తెలిపారు. దేశ చరిత్రలో ఎవరూ పనిచేయనంత అద్భుతంగా మన నాయకుడు కేసీఆర్ పనిచేశారని పేర్కొన్నారు. ఇంటింటికీ నీళ్లు తెచ్చిండు.. సంక్షేమాన్ని చూపించిండు.. అద్భుతమైన అభివృద్ధి చూపెట్టిండని అన్నారు. అయినప్పటికీ 39 సీట్లకే ఎందుకు పరిమితమయ్యామనే దానిపై విశ్లేషించుకోవాలని సూచించారు. అంతర్మథనం చేసుకోకుండా.. అంతా బాగుందని జబ్బలు సరుచుకుని తిరగవద్దని చెప్పారు.

ఎన్నికల్లో అప్పుడుప్పుడు గెలుస్తుంటాం.. అప్పుడప్పుడు ఓడిపోతుంటామని కేటీఆర్ తెలిపారు. అయితే మనకంటే మెరుగైన పరిపాలన, సంక్షేమం అందించే వారి చేతిలో ఓడిపోతే బాధ అనిపించదని.. కానీ కాంగ్రెస్ పరిపాలన ఎలా ఉందని అడిగారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు గోస పడుతున్నారని.. యూరియా కోసం మళ్లీ క్యూలైన్లలో నిలబడే దుస్థితి వచ్చిందని వాపోయారు. నల్గొండలో యూరియా కావాలని లంబాడా సోదరుడు ఆందోళనలో పాల్గొంటే.. ఆయన్ను గుంజుకొచ్చి పోలీస్ స్టేషన్లలో పెట్టి థర్డ్ డిగ్రీ ఇచ్చారని మండిపడ్డారు. ఉల్టా ఆయనపై కేసు పెట్టి.. ఇంటికెళ్లి భార్యను బండబూతులు తిట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ ఆయన నడవరాక కుంటుకుంటూ తిరిగే దుస్థితి వచ్చిందన్నారు. ఆ వీడియోలు సోషల్‌మీడియాలో చూసి.. ఆ పిల్లాడిని పలకరించి ధైర్యం చెప్పి రమ్మని జగదీశ్ రెడ్డికి చెప్పానని అన్నారు. దీనివెనుక ఉన్న ఎవరినీ వదిలిపెట్టవద్దని జగదీశ్ రెడ్డికి తెలిపానని అన్నారు. అవసరమైతే మానవ హక్కుల కమిషన్‌కు వెళ్దామని, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వెళ్తామని తెలిపారు.

రాష్ట్రంలో ఇటువంటి పరిస్థితి ఎందుకు వచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో రైతులు సుభిక్షంగా ఉండేవారని, ఆటోవాళ్లకు చెప్తే.. వాళ్లే ఇంటి ముందు యూరియా బస్తా వేసి వెళ్లేవారని గుర్తుచేశారు. పాతరోజులు తీసుకొస్తానని రేవంత్ రెడ్డి నిజాయితీగా చెప్పిండు.. అన్నట్లే పాత రోజులు తీసుకొచ్చాడని ఎద్దేవా చేశారు. యూరియా కోసం చెప్పుల క్యూలైన్లు, తన్నుకునుడు, గుద్దుకునుడు, పోలీసులు కొట్టడం వంటివి మళ్లీ మొదలయ్యాయని అన్నారు. రైతులను పోలీసులు పొట్టు పొట్టు కొట్టుడేనా రాహుల్ గాంధీ చెప్పిన మొహబ్బతీన్‌కా దుఖాన్ అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ వరంగల్‌కు వచ్చినప్పుడు కిసాన్ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తుచేశారు. కేసీఆర్ రైతుబంధు 10 వేలు ఇస్తే.. మేం 15 వేలు ఇస్తామని అన్నారు. కేసీఆర్ రెండు పంటలకు ఇస్తే మేం మూడు పంటలకు ఇస్తామని తెలిపారు. పంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారు. ఎరువులు, విత్తనాలు ఇస్తామని, రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇన్ని చెప్పి ఇప్పుడు రైతుల మీద పడి పోలీసులు కొడుతున్నారని అన్నారు. ఇది కాంగ్రెసోళ్ల నీతి అని మండిపడ్డారు.

# అనుమతివ్వండి




**ఫార్ములా ఈ-రేసు కేసులో గవర్నర్‌కు ప్రభుత్వ విజ్ఞప్తి**

**కేసు ఫైలును గవర్నర్‌కు పంపిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

**న్యాయనిపుణుల అభిప్రాయం కోరిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

**ఐఏఎస్ అరవింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలప్రాసిక్యూషన్‌కు విజిలెన్స్ కమిషనర్ సిఫారసు**

**పీసీ యాక్ట్ ప్రకారం చర్యలకు కేంద్రానికి ప్రభుత్వం లేఖ**

మేకార్తి దినపత్రిక, హైదరాబాద్, సెప్టెంబరు 2: ఫార్ములా ఈ-కారు రేసు కేసు ఫైలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

# సింగిల్ బెంచ్ తీర్పుపై డీవిజన్ బేంచ్ స్టే



మేకార్తి దినపత్రిక, హైదరాబాద్ :
గ్రూప్-1 మెయి న్స్ పరీక్ష పేపర్లను తిరిగి మూల్యాంక నం చేయాలని లేనిపక్షంలో తిరిగి పరీక్షలను నిర్వహించాలంటూ సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లపై బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే విధించింది. విచారణను వచ్చే నెల 15వ తేదీకి వాయిదా వేసింది హైకోర్టు డివిజన్ బెంచ్.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో 719 మంది అభ్యర్థులు ఒకే రకమైన మారులు సాధించడం, అభ్యర్థుల సంఖ్యలో వ్యత్యాసంపై టీజీపీఎస్సీ ఇచ్చిన వివరణను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదని, కోఠి మహిళా కాలేజీలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో 14.8% మంది టాప్-500 మందిలో ఉన్నారనేందుకు ఆధారాలు లేవని పిటిషన్‌లో పేర్కొన్నారు. భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన పరమేశ్ మట్టా, మరో 221 మంది అభ్యర్థులను ప్రతివాదులుగా చేర్చిన ఈ పిటిషన్‌పై హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది.

# OG కు ఎదురుదెబ్బ



మేకార్తి దినపత్రిక,హైదరాబాద్, సెప్టెంబర్ 24:
ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, సినీ నటుడు పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ప్రస్తుత ట్రెండింగ్ మూవీ '%ూ+%' విడుదలకు ముందే తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బెనిఫిట్ షో, టికెట్ రేట్లు పెంపు మెమోను కోర్టు సస్పెన్షన్లో పెట్టింది. '%ూ+%' సినిమా టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇస్తూ.. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేసింది టీజీ హైకోర్టు. ఈ ఆదేశం సినిమా ప్రేక్షకుల్లో చర్చనీయాంశం కాగా, ఫిల్మ్

# అమలుకాని కాంగ్రేస్ పార్టీ డిక్టరేషన్లు



మేకార్తి దినపత్రిక ,హైదరాబాద్, సెప్టెంబర్ 24 :
బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం బుధవారం జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పదాధికారులకు రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం రామచందర్ రావు మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఇప్పటి వరకు ఒరిగింది ఏమి లేదని విమర్శించారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉ న్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చెప్పిన డిక్లరేషన్లు అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారని వ్యాఖ్యలు చేశారు. గ్రూప్ వన్ పోస్టులను కనీసం భర్తీ చేయలేకపోతుందని.. ఈ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. ఎంబీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చిందని ప్రశ్నించారు.


మోదీ ప్రభుత్వం విశ్వకర్మ పథకం కింద ఆదుకుంటోందని తెలిపారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని.. ఇందుకు ప్రత్యేక జివో ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని వ్యాఖ్యానించారు. 'జీఎస్టీ మేం తెచ్చాం.. తగ్గించాం'రామచందర్ వెల్లడించారు. ప్రపంచం మొత్తం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. దేశంలో పన్నులు తగ్గించిన ఘనత మోదీది అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కనీసం ఆరోగ్య శ్రీ పథకం నిధులు ఇవ్వలేకపోతోందన్నారు.

యూరియా బ్లాక్ మార్కెట్ చేస్తున్నారని... యూరియా కొరతకు కారణం కాంగ్రెస్ పాలన వైఫల్యమంటూ వ్యాఖ్యలు చేశారు. కమిషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసమే తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పాలన చూశారని.... కాంగ్రెస్ పాలన చూశారని.. ఒక్కసారి బీజేపీని ఆశీర్వదించాలని కోరారు.

రాష్ట్ర పదాధికారులకు రామచందర్ రావు సూచనలు

'హైదరాబాద్ వదిలేద్దాం.. గ్రామాలకు వెళదాం. కేంద్ర పథకాలను ప్రజలకు వివరిద్దాం. తెలంగాణకు ఇప్పటి వరకు 12 లక్షల కోట్ల రూపాయల నిధులను ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలను, తప్పిదాలను ప్రజల్లోకి తీసుకువెళ్దాం. జూబ్లీహిల్స్ ఎన్నికలలో విజయం కోసం కష్టపడి పనిచేద్దాం. జూబ్లీహిల్స్, లోకల్ బాడీ ఎన్నికల్లో బీజేపీకి మంచి ఫలితాలు వస్తాయి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# సొంత కూతురునే కిడ్నాప్



మేకార్తి దినపత్రిక,హైదరాబాద్, సెప్టెంబర్ 24:
నగర శివారులోని కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఓ జంట తమ కూతురిని కిడ్నాప్ చేసింది. ఈ ఘటన ఇప్పుడు సంచలనం రేపుతోంది. మరి వారు తమ కూతురుని ఎందుకు కిడ్నాప్ చేశారు..? ఎందుకు కిడ్నాప్ చేశారు..? ఎప్పుడు జరిగింది..? ఎక్కడ జరిగింది..? పూర్తి వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

బుధవారం ఉదయం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సంపల్లి గ్రామంలో కిడ్నాప్ వ్యవహారం కలకలం రేపింది. తల్లిదండ్రులు తమ కన్న కూతురుని కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. ఇందుకు కారణం ప్రేమ వివాహమేనని తెలుస్తోంది. నర్సంపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్, ఓ యువతి ప్రేమించుకున్నారు. వీరి వివాహానికి యువతి తల్లిదండ్రులు అంగీకరించలేదు. ప్రేమ వివాహాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అయినప్పటికీ.. ప్రవీణ్, యువతి ఇంటి నుంచి వెళ్లిపోయి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలోనే వివాదం కొనసాగుతోంది. నాలుగు నెలలుగా ఈ వ్యవహారం కొనసాగుతుండగా.. బుధవారం నాడు షాకింగ్ ఘటన చోటు చేసుకుంది.

యువతి తల్లిదండ్రులు తమ బంధువులతో కలిసి బుధవారం తెల్లవారుజామునే ప్రవీణ్ ఇంటికి వెళ్లారు. ప్రవీణ్‌పై అతని కుటుంబ సభ్యులపై దాడి చేశారు. అనంతరం కారంపొడి చల్లి, కళ్లకు బట్టలు కట్టి యువతిని ఎత్తుకెళ్లారు ఆమె తల్లిదండ్రులు. ఈ ఘటన స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. అయితే, అమ్మాయి భర్త ప్రవీణ్.. పోలీసులను ఆశ్రయించాడు. ఘటనపై ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అమ్మాయి తల్లిదండ్రులపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నారు.

# రాజకీయ ప్రమేయం లేకుండా ఇందిరమ్మ ఇళ్లు



మేకార్తి దినపత్రిక, ఖమ్మం జిల్లా :
ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్ళు కడితే, రాష్ట్ర విభజన తరువాత పది సంవత్సరాల పాలనలో ఉన్న బీఆర్ఎస్, తెలంగాణలో హౌసింగ్ డిపార్ట్మెంట్ అనేదే లేకుండా చేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ధనిక రాష్ట్రమైన తెలంగాణాలో 10 లక్షల ఇళ్లు కట్టాల్సి ఉందని, అయితే, కేసీఆర్ తీవ్ర నిర్లక్ష్యం చూపారని మంత్రి ఆరోపించారు. ఖమ్మం రూరల్ మండలం ఆరేంపులలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించి, ఇందిరమ్మ గృహాల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేవలం కమీషన్ కోసం ధనిక తెలంగాణా రాష్ట్రాన్ని దగా చేసి కేసీఆర్, కాళేశ్వరం కట్టాడని మంత్రి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. 'కాళేశ్వరం ఫౌండేషన్ వేసింది, ప్రారంభించింది కేసీఆర్. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే కాళేశ్వరం కూలిపోయింది. ఎక్కడా అవినీతి జరగకుండా పేదవారికి ఇళ్లు ఇచ్చే విధంగా

PRGI NO: TGTEL/25/A2356
మేకార్తి దినపత్రిక
25- 09 -2025 గురువారం
WWW.MEKARTIDINAPATRIKA.COM

# కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్‌కు అనుమతివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

వద్ద నుంచి రాజ్‌భవన్‌కు చేరింది. ఈ కేసులో ఏ1గా ఉన్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ప్రభుత్వం కోరింది. దీనిపై గవర్నర్ న్యాయనిపుణుల అభిప్రాయం కోరినట్లు తెలిసింది. ఫార్ములా ఈ-కారు రేసు కేసు దర్యాప్తు చేపట్టిన ఏసీబీ.. తమ దర్యాప్తు పూర్తయిందని, కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్ చర్యలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఇదివరకే ప్రభుత్వానికి లేఖ రాసింది. ప్రభుత్వం ఆ లేఖను, ఏసీబీ రిపోర్టును విజిలెన్స్ కమిషనర్‌కు పంపించింది. ఏసీబీ రిపోర్టును పరిశీలించిన విజిలెన్స్ కమిషనర్.. నిందితులపై ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టవచ్చంటూ క్లియరెన్స్ ఇచ్చారు. అయితే కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్ చర్యలకు గవర్నర్ అనుమతి అవసరమైనందున.. విజిలెన్స్ సిఫారసుతోపాటు ఏసీబీ నివేదికను గవర్నర్‌కు సీఎస్ పంపించారు. దీనిపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బు?ధవారం న్యాయనిపుణుల అభిప్రాయాన్ని కోరినట్లు తెలుస్తోంది. వారి అభిప్రాయం అందిన తర్వాత కేటీఆర్ ప్రాసిక్యూషన్‌పై గవర్నర్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఫార్ములా ఈ-కారు రేసు కేసులో కేటీఆర్ సహా ఐదుగురిని నిందితులుగా ఏసీబీ పేర్కొన్న విషయం తెలిసిందే. వీరిలో ఫార్ములా ఈ-ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థ, త్రైపాక్షిక ఒప్పందంలో కీలకమైన ఏస్ నెక్ట్స్‌జెన్ సంస్థ ఎండీ, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఉన్నారు.

ఒప్పందం దగ్గర్నుంచి చెల్లింపుల దాకా..

ఫార్ములా ఈ-కారు రేసుకు సంబంధించి ఒప్పందం దగ్గర్నుంచి డబ్బు చెల్లింపు దాకా నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ ఏసీబీ అధికారులు ప్రభుత్వానికి పంపిన నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ముందస్తు అనుమతులు తీసుకోకుండా ఎఫ్ఈవోకు రెండు విడతలుగా డబ్బు చెల్లించారని, విదేశీ కరెన్సీలో చెల్లింపులు జరిగాయని, దీని వల్ల ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల నష్టం జరిగిందని వివరించినట్లు సమాచారం. ఇదంతా ఆనాడు మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశాల మేరకే జరిగిందనడానికి అవసరమైన అన్ని ఆధారాలను సేకరించామని పేర్కొన్నట్లు సమాచారం. కాగా, క్యాబినెట్ అనుమతి లేకుండా పెద్ద మొత్తంలో డబ్బును హెచ్‌ఎండీఏ నిధుల నుంచి చెల్లించడం వల్ల ప్రభుత్వానికి ఎలాంటి నష్టం జరిగిందో తెలుపుతూ పురపాలకశాఖ కార్యదర్శి హోదాలో దానకిశోర్ ఇచ్చిన ఫిర్యాదుతో గత ఏడాది ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆ వెంటనే మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్‌తోపాటు నిందితులందరినీ పలుమార్లు ఏసీబీ, ఈడీ అధికారులు వేర్వేరుగా విచారించి ఆధారాలు సేకరించారు. కేటీఆర్ అప్పట్లో వాడిన సెల్‌ఫోన్, ట్యాబ్ ఇవ్వాలని ఏసీబీ నోటీసులు జారీ చేసినప్పటికీ.. వాటిని ఇవ్వకుండా కేటీఆర్ ఏసీబీని ప్రశ్నిస్తూ లేఖ రాయడం అప్పట్లో సంచలనం సృష్టించింది.

అరవిందకుమార్‌పై చర్యకు కేంద్రానికి లేఖ..

అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలపై ఐపీసీ సెక్షన్లతోపాటు అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇందులో ఐపీసీ సెక్షన్లకు సంబంధించి తదుపరి చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే అరవింద్‌కుమార్ ఐఏఎస్ అధికారి కావడంతో ఆయనపై అవినీతి నిరోధక చట్టం ప్రకారం నమోదైన సెక్షన్లలో ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టాలంటే కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరం. దీంతో కేంద్ర సిబ్బంది, వ్యవహారాల శాఖకు ఏసీబీ రిపోర్టు, విజిలెన్స్ నివేదికను జత చేసి.. అరవింద్‌కుమార్‌పై పీసీ యాక్ట్ ప్రకారం చర్యలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయనున్నట్లు సమాచారం.

# గురు, శుక్రవారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు



హైదరాబాద్: రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో భారీ, భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని (%నముఖజఎ ఘఱఅఅం%) హైదరాబాద్ వాతావరణశాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ వర్షాలు సెప్టెంబర్ 30 వరకు కొనసాగుతాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. గురువారం మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నల్లగొండ, సూర్యాపేటలో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వానలు పడుతాయని తెలిపింది. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందని పేర్కొంది.

శుక్రవారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఇక శనివారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, కుమ్రం భీం, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# OG కు ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

ఇండస్ట్రీకి షాకింగ్‌గా మారింది.

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల '%ూ+%' సినిమాకు ప్రత్యేకంగా టికెట్ రేట్లు పెంచుకునేందుకు, బెనిఫిట్ షోలు నిర్వహించేందుకు అనుమతి ఇస్తూ మెమో జారీ చేసింది. ఈ మెమో.. సాధారణ టికెట్ ధరలతోపాటు అదనపు ఛార్జీలు వసూలు చేసి, ప్రేక్షకుల నుంచి ఎక్కువ ఆదాయం సంపాదించుకునేందుకు వీలు కల్పిస్తుంది. అయితే, ఈ నిర్ణయంపై నమోదైన కేసును పరిశీలించిన తెలంగాణ హైకోర్టు, దీన్ని తాత్కాలికంగా ఆపేసింది. ఈ ఉత్తర్వులు ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా ఉన్నాయని, ప్రేక్షకుల హక్కులను దెబ్బతీస్తాయని స్పష్టం చేసింది.

'%ూ+%' సినిమా పవన్ కల్యాణ్‌ను గ్యాంగ్‌స్టర్ రోల్‌లో చూపించిన హై-యాక్షన్ థ్రిల్లర్. ఈ సినిమా విడుదల తేదీ సెప్టెంబర్ 25. రేపు విడుదల కానున్న నేపథ్యంలో హైకోర్టు ఆదేశం సినిమాకు భారీ ఎదురుదెబ్బగా మారింది. ఇండస్ట్రీ వర్గాలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ కోర్టు పునర్విచారణకు ప్రభుత్వం పిటిషన్ వేయాలని సూచిస్తున్నాయి. బెనిఫిట్ షోలు లేకపోతే సినిమా ప్రమోషన్, ఓపెనింగ్ డే కలెక్షన్లు దెబ్బతింటాయని నిర్మాణ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణలో సినిమా టికెట్ రేట్లు పెంపు విషయం ఇదే మొదటిసారి కాదు. ముఖ్యంగా భారీ సినిమాలకు ప్రత్యేక అనుమతులు ఇవ్వడం ఇటీవల వివాదాస్పదంగా మారుతోంది.

కాగా, రేపు (ఈనెల 25న) ఓజీ సినిమా రిలీజ్ అవుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం పవన్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

ఈ కేసులో ముఖ్యమైన అంశాలు:

ఓజీ సినిమా టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు

ఈ మేరకు ఆదేశాలు జారీ చేసిన జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్.

ఓజీ టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ ఇటీవల మెమో జారీ చేసిన తెలంగాణ హెూంశాఖ.

హెూంశాఖ మెమోను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన మహేష్ యాదవ్.

టికెట్ల పెంపునకు అనుమతి ఇవ్వడానికి హెూంశాఖ స్పెషల్ సీఎస్‌కు ఎలాంటి అధికారాలు లేవన్నా పిటిషన్ తరఫు న్యాయవాది.

హైదరాబాద్ పరిధిలో పోలీస్ కమిషనర్, జిల్లాల పరిధిలో జాయింట్ కలెక్టర్ కు మాత్రమే మెమో జారీ చేసే అధికారం ఉందన్న పిటిషన్ తరఫు న్యాయవాది.

టికెట్లు అధిక ధరకు విక్రయించకూడదని నిబంధనలు ఉన్నాయన్న పిటిషన్ న్యాయవాది.

గేమ్ ఛేంజర్ సినిమా సందర్భంగా హెూంశాఖ అండర్ టేకింగ్ కూడా ఇచ్చిందన్న పిటీషనర్ న్యాయవాది.

పిటీషనర్ న్యాయవాది వాదనను పరిగణలో తీసుకున్న హైకోర్టు.

టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ జారీ చేసిన మెమోను సస్పెండ్ చేసిన జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్.

తదుపరి విచారణ వచ్చే నెల 9వ తేదీకి వాయిదా

# ఎప్పుడైనా స్థానిక నోటిఫికేషన్



## నేడు లేదా రేపు రిజర్వేషన్ల జీవో జారీ? ఇప్పటికే సిద్ధంచేసిన యంత్రాంగం!

మేకార్తి దినపత్రిక, హైదరాబాద్, సెప్టెంబర్ 24:

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 26 లేదా 27న జారీ అవుతుందా? దస రా తర్వాత ఏ క్షణమైనా నోటిఫికేషన్ విడుదల అవుతుందా? అంటే రాష్ట్రంలో అధికార యంత్రాంగం వడివడిగా చేపట్టిన ఎన్నికల ముందస్తు కసరత్తు దానికి సంకేతంగా కనిపిస్తున్నది. దసరా తర్వాత ఏ క్షణమైనా ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని సమాచారం. చట్టబద్ధంగా నిలుస్తుందా? లేదా? అన్నదానితో సంబంధం లేకుండా హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఏర్పాట్లకే సిద్ధమవుతున్నది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం తన సంసిద్ధతను తెలుపుతూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి నేడో, రేపో లేఖ రాసే అవకాశం ఉన్నది. రిజర్వేషన్ల వివరాలను అందించనున్నట్టు సమాచారం. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లపై గురువారం రాత్రి లేదా శుక్రవారం ఉదయం జీవో జారీ చేస్తారని, ఆ జీవోతోపాటు షెడ్యూల్ ఒకే సమయంలో వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తున్నది.

సీఎంవోలో రిజర్వేషన్ల జీవో!

ఎన్నికల ప్రక్రియను ఒకసారి మొదలుపెట్టిన తర్వాత కోర్టులు పెద్దగా జోక్యం చేసుకోకపోవచ్చన్న భావనతో అధికారులు ఉన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పంపిన బిల్లు ఇంకా ఆమోదం పొందలేదు. ఈ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నది. ఈ నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల కోసం జీవో ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తుండగా, డ్రాఫ్ట్ జీవోను ఇప్పటికే సిద్ధంచేశారు. న్యాయ, సంక్షేమ శాఖ ల కార్యదర్శుల పరిశీలన కూడా పూర్తయి సీఎంవోలో ఉన్నది. 26న స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ ఇచ్చి దసరా తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెల్సింది. హైకోర్టు ఈనెల 30లోపు స్థానిక ఎన్నికలు నిర్వహించాలని చెప్పిన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను మొదలు పెట్టామని ప్రభుత్వం కోర్టుకు చెప్పుకునేందుకు 26న షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉన్నట్టు చెప్తున్నారు.

రేపు, ఎల్లుండి పోలింగ్ అధికారులకు శిక్షణ

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ అధికారుల(పీవో)ను నియమించాలని అన్ని కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి లేఖలు రాశారు. నియమించిన పీవోలకు రెండు రోజులపాటు జిల్లాల వారీగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 26, 27న డివిజన్ల వారీగా శిక్షణ ఏర్పాట్లు చేశారు.

# రాజకీయ ప్రమేయం లేకుండా ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

సంస్కరణలు తీసుకోచ్చాము. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చాము. ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చేటప్పుడు ప్రతిపక్ష నాయకులు హేళనగా మాట్లాడారు. గడిచిన పది సంవత్సరాల్లో ఆనాటి ప్రబుద్ధులు ఇళ్లు ఇస్తామని ఎన్నికలు ఎక్కడ ఉంటే అక్కడ గ్రాఫిక్స్ బొమ్మలు చూపించారు. ఆనాటి పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో మాయమాటలు చెప్పి కాలయాపన చేశారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మెట్రిక్ టన్నుల గోదాములను కట్టబోతున్నాం. 9 వేల 700 మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్ కి శంకుస్థాపన చేసాం. రాజకీయ ప్రమేయం లేకుండా ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తున్నాం.' అని మంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.



# రాష్ట్రంలో ఆటవిక, అరాచక రాజ్యం

రాష్ట్రంలో ఆటవిక, అరాచక రాజ్యం నడుస్తోందని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. పోలీసులను అడ్డం పెట్టుకొని రేవంత్ రెడ్డి అరాచక పాలన చేస్తుండని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు చెబితే పోలీసులు అక్రమ కేసులు పెట్టి దాడులు చేస్తున్నారని అన్నారు. యూరియా కోసం ధర్నా చేసినందుకు పోలీసులు చిత్రహింసలు పెట్టిన గిరిజన రైతు సాయి సిద్దు ఇంటికి ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భగత్‌లో వెల్లి జగదీశ్ రెడ్డి పరామర్శించారు.

ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కొత్తపేట తండాలో యూరియా ధర్నాలో పాల్గొన్నందుకు సాయి సిద్దు అనే గిరిజన యువకుణ్ణి పోలీసులు ఇంతలా కొడతారా? ఇంత దారుణం ఉంటుందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన యువకుణ్ని పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని.. హామీలు ఇచ్చి ఎగ్గొట్టిన అసలు దోషులు కాంగ్రెస్ నాయకులు. వాళ్లను కొట్టాలని అన్నారు.

సాయి సిద్దును కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎస్పీ పోలీసులను వెనకేసుకొని వస్తుండని.. జిల్లాలో ఎస్పీలు కూడా కాంగ్రెస్ నాయకుల్లాగా పని చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో అమాయకులను కేసుల్లో ఇరికించి కొడుతున్నారని అన్నారు. యూరియా ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ఈ ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందని తెలిపారు. ఇంత పనికిమాలిన ప్రభుత్వం ఎక్కడా లేదని స్పష్టం చేశారు.

ఈ జిల్లాలోనే యూరియా కోసం లైన్లో నిలబడి తోపులాట జరిగి గాయపడి ఓ



గిరిజన మహిళ చనిపోయిందని.. అయినా ఈ ప్రభుత్వానికి సిగ్గు లేదని జగదీశ్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని.. మిర్యాలగూడలో యూరియా లారీలను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలే యూరియా దందా చేస్తున్నారని విమర్శించారు. సాయి సిద్దు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబానికి దిక్కెవరు? పని చేసుకోలేనంతగా బాగా కొట్టారని అన్నారు. ఆ పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# ఇష్టం లేని పెళ్లి చేసుకుందని

తమకు ఇష్టంలేకుండా లవ్ మ్యారేజి చేసుకుందని ఓ తల్లిదండ్రులు కన్నకూతుర్నే కిడ్నాప్ చేశారు. యువకుడి ఇంటికి వెళ్లిన బంధువులు కూతురి కళ్లలో కారం చల్లి, ఈడ్చుకుంటూ కారులో తమ ఇంటికి తీసుకెళ్లారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరలో ఈ ఘటన జరిగింది. కాగా, దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరకు చెందిన బాల నర్సింహ, మహేశ్వరి దంపతుల కుమార్తె శ్వేత.. అదే గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడిని ప్రేమించింది. వారి పెళ్లికి శ్వేత కుటుంబసభ్యులు ఒప్పుకోలేదు. అయినప్పటికీ వారికి ఇష్టం లేకుండానే ప్రవీణ్‌ను నాలుగు నెలల క్రితం పెళ్లి చేసుకుంది. అతని ఇంట్లోనే ఉంటుంది. తమకు ఇష్టం లేని పెళ్లి చేసుకుందని కోపంలో ఉన్న పేరెంట్స్ బుధవారం ప్రవీణ్ ఇంటికి వెళ్లారు. బంధువుల సాయంతో శ్వేతను కిడ్నాప్ చేశారు.

బుధవారం తెల్లవారుజామునే శ్వేత కుటుంబసభ్యులు ప్రవీణ్ ఇంటికి వెళ్లి దాడి చేశారు. శ్వేత కళ్లలో కారం చల్లి, బట్టలతో కట్టేసి ఈడ్చుకుంటూ తీసుకెళ్లి కారు ఎక్కించారు. అడ్డొచ్చిన ప్రవీణ్, అతని కుటుంబసభ్యులపై నాకర్రలతో దాడి చేశారు. ఈ తతంగమంతా అక్కడే ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రవీణ్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# 5000 రూపాయలు ఆర్థిక సహాయం

మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ 24

చేర్యాల ప్రతినిధి కర్రోళ్ల నవజీవన్.

చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన పోరండ్ల కృష్ణమూర్తి మరణించడం జరిగినది. ఈ విషయము జనగామ ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్ రెడ్డికి తెలుపక వెంటనే జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి 5000 రూపాయలు ఆర్థిక సాయంఅందించారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు పాల్గొన్నారు.



PRGI NO: TGTEL/25/A2356
మేకార్తి దినపత్రిక
25- 09 -2025 గురువారం
WWW.MEKARTIDINAPATRIKA.COM

# జాతీయం

## శబరిమల చేరుకున్న ద్వారపాలక విగ్రహ తాపడాలు



తిరువనంతపురం: స్వామి అయ్యప్ప కొలువుదీరిన శబరిమల ద్వారపాలక విగ్రహ తాపడాలు చెన్నై నుంచి మరమ్మతు అనంతరం తిరిగి అయ్యప్ప సన్నిధికి ఆదివారంనాడు చేరుకున్నాయి. ఈ విషయాన్ని ట్రావెన్‌కోర్ దేవస్వాం బోర్డు వెల్లడించింది. ద్వారపాలక విగ్రహాల బంగారు తాపడం బరువు తగ్గడాన్ని కేరళ హైకోర్టు ఇటీవల తీవ్రంగా పరిగణించడం, విజిలెన్స్ కమిటీ దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.

విగ్రహ తాపడాలు మరమ్మతు అనంతరం తిరిగి సన్నిధానం చేరుకున్నాయని, సంబంధిత తాంత్రి పూజాదికాలు నిర్వహించిన అనంతరం విగ్రహాలకు వాటిని అమర్చడం జరుగుతుందని టీడీబీ అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని హైకోర్టు త్వరలోనే తెలియజేస్తామని చెప్పారు.

శబరిమలలో గర్భగుడి ముందున్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూత పూసిన రాగి తాపడాలను 2019లో మరమ్మతుల నిమిత్తం తొలగించారు. ఆ సమయంలో వాటి బరువు 42.8 కిలోలు ఉన్నట్టు రికార్డుల్లో ఉంది. అయితే, ఆ తాపడాలను తిరిగి బిగించినప్పుడు వాటి బరువు 38.258 గ్రాములుగా ఉంది. ఈ వ్యవహారంలో అనేక లోపాలున్నట్టు గుర్తించిన హైకోర్టు దీనిపై విజిలెన్స్ కమిటీ దర్యాప్తునకు ఆదేశించింది. విజిలెన్స్, యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) దీనిపై ప్రాథమిక విచారణ ప్రారంభించింది.

## విజయం భారత్‌దే




న్యూఢిల్లీ: హెచ్-1బి వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సూటిగా స్పందించారు. 'మన ప్రతిభను చూసి కొందరు భయపడుతున్నట్టుంది' అని వ్యాఖ్యానించారు. ఏదిఏమైనా భారత్ విజేతగా నిలుస్తుందన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక వీడియో పోస్ట్ చేశారు.

మొదటి త్రైమాసికంలో భారత్ వృద్ధి రేటు 7.8గా ఉందని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. ఆర్థికవేత్తల అంచనాలను మించి ఇండియా వృద్ధి అప్రతిహతంగా సాగుతోందన్నారు. ఏదిఏమైనా భారత్ విజేతగా నిలవడం ఖాయమన్నారు. భారతదేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచం గుర్తించిందని, పలు దేశాలు మనతో స్వేచ్ఛా వాణిజ్యానికి ముందుకొస్తున్నాయని చెప్పారు. వాణిజ్యం పెంచుకుని, భారత్‌తో సంబంధాలు మెరుగుపరచుకోవాలని ఆయా దేశాలు కోరుకుంటున్నాయని అన్నారు. కొందరు మన ప్రతిభను చూసి కొంచెం భయపడుతున్నారని, దానికి కూడా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఛలోక్తి విసిరారు.

కాగా, భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ఒప్పందం చర్చలను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు పీయూష్ గోయెల్ ఈనెల 22న అమెరికా వెళు న్నారు. దీనిపై అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ టీమ్ ఈనెల 16న ఢిల్లీలో చర్చలు జరిపింది. ఈ క్రమంలో పీయూష్ గోయల్ అమెరికా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

## కబడ్డీ మ్యాచ్ సందర్భంగా తీవ్ర విషాదం



కబడ్డీ మ్యాచ్ సందర్భంగా తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కరెంట్ షాక్ కారణంగా ముగ్గురు చనిపోగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఆదివారం ఉదయం కొండగావ్ ప్రాంతంలోని రవస్వాహీ గ్రామంలో కబడ్డీ మ్యాచ్ జరుగుతూ ఉంది. కొంతమంది మ్యాచ్ జరుగుతున్న ప్రాంతంలో టెంట్‌లో కూర్చున్నారు. ఎంతో ఆసక్తిగా మ్యాచ్ చూస్తూ ఉన్నారు.

ఇలాంటి సమయంలో టెంట్ కోసం భూమిలో పాతిన ఇనుప రాడ్డులో కరెంట్ పాస్ అయింది. ఈ విషయం తెలియని ఓ వ్యక్తి రాడ్డుపై చెయ్యి వేశాడు. అతడికి షాక్ కొట్టింది. అతడితో పాటు అతడ్ని పట్టుకున్న మరో ఐదుగురికి కూడా కరెంట్ షాక్ కొట్టింది. అందరూ అక్కడే కుప్పకూలిపోయారు. మ్యాచ్ ఆగిపోయింది. స్థానికులు బాధితులను హుటాహుటిన దగ్గరలోని విశ్రమ్‌పురి ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు ముగ్గురు అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు.

ప్రాణాలతో బయటపడ్డ మరో ముగ్గురికి చికిత్స అందించారు. వీరిలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు విశ్రమ్‌పురి ఆస్పత్రికి వెళ్లారు. చనిపోయిన వారిని సతీష్ నేతమ్, శ్యామలా నేతమ్, సునీల్ శోరీలుగా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముగ్గురి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మేడిన్ ఇండియా ఉత్పత్తులే వాడాలి



న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ (%చీఏతీవఅనతీ వీశీఱ%) దేశ ప్రజలకు దేవీనవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నుంచి జీఎస్టీ ఉత్సవం ప్రారంభమవుతోందని, పేద మధ్య తరగతి వర్గాలకు ఇది డబుల్ బొనంజా అని అభివర్ణించారు. జీఎస్టీతో వన్ నేషన్-వన్ ట్యాక్స్ కలలు సాకరమయ్యాయని అన్నారు. జీఎస్టీ మార్పులతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. సరికొత్త చరిత్ర సృష్టించేందుకు జీఎస్టీ మార్పులు సహకరిస్తాయని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో దేశంలో రకరకాల పన్నులతో ప్రజల్లో గందరగోళం ఉండేదని, జీఎస్టీ ఆ గందరగోళం నుంచి బయటపడేసిందని చెప్పారు. రేపట్నించి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గనున్నాయని, కొత్త జీఎస్టీ వల్ల ఉత్పత్తిదారులు, వినియోగదారలకు ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. వస్తు రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. 12 శాతం పన్ను ఉన్న 99 శాతం వస్తువులు 5 శాతం పన్నులోకి వచ్చాయని, పేదలు వాడే అనేక వస్తువులపై సున్నా శాతం జీఎస్టీ ఉంటుందని చెప్పారు. సంస్కరణలతో పెట్టుబడుల ప్రవాహం పెరుగుతుందని, అదే విధంగా దేశ ప్రజల పొదుపు కూడా పెరుగుతుందని మోదీ చెప్పారు. అన్ని రాష్ట్రాలతో చర్చించిన తర్వాతే ఇంత పెద్ద సంస్కరణలు తీసుకువచ్చామని వివరించారు. దేశంలో కొత్త మధ్యతరగతి వర్గం పెరుగుతోందని, వారికి ఇది ప్రోత్సాహకరంగా ఉంటుందని చెప్పారు. పర్యాటక రంగానికి జీఎస్టీ సంస్కరణలు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. హెూటల్స్ సేవలపైనా జీఎస్టీ తగ్గించామని తెలిపారు. సంస్కరణలు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతమిస్తాయని చెప్పారు. జీఎస్టీ తగ్గింపులతో ఎంఎస్‌ఎంఈలు లాభపడతాయన్నారు.

మేడిన్ ఇండియా ఉత్పత్తులే వాడాలి

ప్రధాని మంత్రి ఈ సందర్భంగా మరోసారి మేడిన్ ఇండియా ఉత్పత్తులే వాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దేశం సమృద్ధిగా ఉండాలంటే దేశీయ ఉత్పత్తులే వాడాలని సూచించారు. మన ఉత్పత్తుల నాణ్యత దేశ గౌరవాన్ని మరింత పెంచుతోందని, నాగరిక్ దేవోభవన అనే మంత్రంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

## దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్




గమనం,న్యూఢిల్లీ: బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తరహాలోనే దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ చేపట్టేందుకు ఎన్నికల కమిషన్ సమాయత్తమవుతోంది. ఇందుకోసం సెప్టెంబర్ 30వ తేదీలోగా సన్నద్ధం కావాలని అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ఈసీ ఆదేశాలిచ్చింది. ఓటర్ లిస్ట్ క్లీనప్ ఎక్సర్‌సైజ్‌ను అక్టోబర్-నవంబర్ నాటికి ప్రారంభించనున్నట్టు సంకేతాలిచ్చింది.

ఈసీ వర్గాల సమాచారం ప్రకారం, రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులతో (%జజుూం%) న్యూఢిల్లీలో ఈసీ ఇటీవల సమావేశం నిర్వహించింది. రాబోయే 10-15 రోజుల్లో ఎస్ఐఆర్ రోల్‌అవుట్‌కు సిద్ధంగా ఉండాలని ఈసీ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో ఆదేశాలిచ్చారు. లాంఛనంగా సెప్టెంబర్ 30వ తేదీని చివరితేదీగా నిర్ణయించారు. చివరిసారిగా నిర్వహించిన ఎస్ఐఆర్ ఓటర్ లిస్ట్‌ను సిద్ధంగా ఉంచాలని ఈసీ ఆదేశాలిచ్చింది. గత ఎస్ఐఆర్ తర్వాత ఓటర్ల జాబితాలను పలు రాష్ట్రాల సీఈఓలు ఇప్పటికే తమ వెబ్‌సైట్‌లో ఉంచారు. న్యూఢిల్లీలో చివరిసారిగా 2008లో ఎస్ఐఆర్ నిర్వహించారు. ఉత్తరాఖండ్‌లో 2006లో చివరిసారిగా ఎస్ఐఆర్ నిర్వహించారు. చాలా రాష్ట్రాల్లో చివరిసారి ఎస్ఐఆర్ 2002-2004 మధ్య జరిగింది.

బిహార్ తర్వాత దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించనున్నట్టు ఈసీ ఇటీవల ప్రకటించింది. 2026లో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. పుట్టినస్థలం రికార్డులను పరిశీలించి అక్రమ విదేశీ వలసదారులను జాబితా నుంచి తప్పించడం ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యంగా ఉంది.

## త్వరలో 11,12 తరగతుల్లో నైపుణ్య అధికారిత విద్య



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21: భారత విద్యావ్యవస్థలో మరిన్ని మంచి మార్పులు త్వరలో రాబోతున్నాయి. దండగమారి చదువులంటూ వస్తున్న విమర్శల్ని, ఉద్యోగాలకు తగిన నైపుణ్యం కల్గిన అభ్యర్థులు దొరకడంలేదన్న అసంతృప్తుల్ని తిప్పికొట్టేలా నిర్మాణాత్మక చర్యలు జరుగబోతున్నాయి. త్వరలో 11-12వ తరగతుల పాఠ్యాంశాల్లో నైపుణ్య ఆధారిత (స్కిల్-బేస్డ్) లెర్నింగ్‌ను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రచిస్తోంది. ఈ కొత్త విద్యా విధానం ద్వారా విద్యార్థులకు.. ఉద్యోగాలకు అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యాలను అందించాలని, దేశ వృద్ధికి దోహదపడే మానవ వనరులను సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ ప్రణాళిక ప్రకారం, రాష్ట్రీయ విద్యా భవన్ ద్వారా 11వ, 12వ తరగతుల సిలబస్‌లో స్కిల్ ఆధారిత మాడ్యూల్స్‌ను చేర్చనున్నారు. ఇందులో ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, హెల్త్‌కేర్, రెన్యూవబుల్ ఎనర్జీ వంటి ఆధునిక రంగాల్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇస్తారు. 'విద్యార్థులు పుస్తకాలతో మాత్రమే పరిమితం కాకుండా, రియల్-వరల్డ్ స్కిల్స్‌తో సిద్ధమవ్వాలి.. ఇది భారత్‌ను గ్లోబల్ స్కిల్ హబ్‌గా మార్చుతుంది' అని కేంద్ర విద్యా, నైపుణ్య అభివృద్ధి, వ్యవస్థాపకత శాఖల మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.

ఈ చర్య భారత్‌లో 50శాతం కంటే ఎక్కువ మంది యువతకు ఉద్యోగాలు అందించడం, స్కిల్ ఇండియా మిషన్‌కు అనుగుణంగా పనిచేయడం వంటి లక్ష్యాలను సాధించడానికి దోహదపడుతుందని అధికారులు అంటున్నారు. 2026-27 అకడమిక్ ఇయర్ నుంచి ఈ మార్పులు అమలులోకి వస్తాయని, రాష్ట్రాలతో కలిసి పైలట్ ప్రాజెక్టులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ప్రయత్నం ద్వారా విద్యా వ్యవస్థను మరింత ప్రయోజనకరంగా, ఉద్యోగోద్యోగికరంగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది.

## డిప్యూటీ సీఎం ఖాతా హ్యాక్



మహారాష్ట్ర నుంచి ఓ షాకింగ్ వార్త వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఖాతా ఈరోజు ఉదయం హ్యాక్ అయ్యింది. ఆ క్రమంలో హ్యాకర్లు ఈ ఖాతా నుంచి పాకిస్తాన్, టర్కీ జెండాలతో కూడిన చిత్రాలను పోస్ట్ చేసి సంచలనం సృష్టించారు. ఈ పోస్టులు చూసిన నెటిజన్లు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు.

ఇవి చూసిన మరికొంత మంది ఒక్కసారిగా చర్చించడం మొదలుపెట్టారు. డిప్యూటీ సీఎం ఖాతా హ్యాక్ కావడం, అది కూడా ఇతర దేశాల జెండాలను పోస్ట్ చేయడం అనేక మందిని ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఈ పోస్టులు కొద్ది సేపట్లోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఖాతా తిరిగి స్వాధీనం

ఈ హ్యాకింగ్ సమాచారం అందుకున్న కొద్ది సేపటికే, షిండే టెక్నికల్ బృందం వెంటనే రంగంలోకి దిగింది. అనధికారికంగా పోస్ట్ చేసిన అన్ని పోస్టులను తొలగించింది. షిండే ఖాతాను సురక్షితంగా తిరిగి స్వాధీనం చేసుకుంది. ఇప్పుడు ఆ ఖాతా మళ్లీ సాధారణ స్థితిలో కొనసాగుతోంది. టెక్నికల్ బృందం ఈ ఘటనపై దృష్టి సారించి, మరిన్ని భద్రతా చర్యలు తీసుకుంటోంది.

పెరుగుతున్న ముప్పు


ఈ ఘటన దేశంలో సైబర్ నేరాలు ఎంత వేగంగా పెరుగుతున్నాయో స్పష్టం చేస్తోంది. డిజిటల్ లావాదేవీల పెరుగుదల, ఇంటర్నెట్ వినియోగం పెరగడం, ఏఐ వాడకం, సైబర్ దాడులకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఈ దాడుల వల్ల ప్రతి ఏటా దేశం భారీగా నష్టపోతుంది. హ్యాకర్లు ఇలాంటి దాడులతో గందరగోళం సృష్టించడమే కాక, సమాజంలో భయాందోళనలను కూడా సృష్టిస్తున్నారు.

ప్రభుత్వం చర్యలు

ప్రభుత్వం సైబర్ నేరాలను అరికట్టడానికి అనేక చర్యలు తీసుకుంటోంది. సైబర్ సెక్యూరిటీ విభాగాలను సైతం బలోపేతం చేస్తోంది. కొత్త టెక్నాలజీలను ఉపయోగిస్తూ హ్యాకింగ్‌ను నిరోధించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ప్రజల్లో సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచడం చాలా ముఖ్యం. సోషల్ మీడియా ఖాతాలను సురక్షితంగా ఉంచడానికి బలమైన పాస్‌వర్డ్‌లు, టూ-ఫాక్టర్ ఆథంటికేషన్ వంటి భద్రతా చర్యలను అనుసరించాలని టెక్ వర్గాలు సూచిస్తున్నాయి.

# అంతర్జాతీయం

## ట్రంప్‌కు షాకిచ్చిన తాలిబన్లు



ఇంటర్నెట్ డెస్క్: బాగ్రామ్ వైమానిక స్థావరాన్ని తిరిగిచ్చేయాలంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు తాలిబన్లు గట్టిగా బదులిచ్చారు. అఫ్ఘాన్ భూభాగంలో అంగుళం కూడా ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. రాజధాని కాబుల్‌కు ఉత్తరాన బాగ్రామ్ వాయుసేన స్థావరం ఉంది. యావత్ దేశంలో ఇదే అతిపెద్ద వాయుసేన స్థావరం. అమెరికా మిలిటరీ దాదాపు 20 ఏళ్ల పాటు ఇక్కడి నుంచే తన కార్యకలాపాలు నిర్వహించింది. అఫ్ఘానిస్థాన్ తాలిబన్‌ల వశమయ్యాక అమెరికా సేనలు బాగ్రామ్ విడిచిపెట్టి స్వదేశానికి పయనమయ్యాయి.

ట్రంప్ కామెంట్స్‌పై ఇటీవల అఫ్ఘానిస్థాన్ రక్షణ శాఖ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఫసీహుద్దీన్ ఫిత్రత్ స్పందించారు. ఏదోక రాజకీయ డీల్ ద్వారా ఈ స్థావరాన్ని కొందరు మళ్లీ దక్కించుకోవాలని చూస్తున్నట్టు తెలిపారు. చర్చలు కూడా జరుపుతున్నామని వాళ్లు చెప్పుకుంటున్నట్టు తెలిపారు. అయితే, అఫ్ఘాన్ భూభాగానికి చెందిన ఒక అంగుళం నేలపైనా ఎలాంటి డీల్ కుదరదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అఫ్ఘానిస్థాన్ ప్రభుత్వం కూడా ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమ స్వాతంత్ర్యానికి, ప్రాదేశిక సమగ్రతకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తామని పేర్కొంది.

బాగ్రామ్ స్థావరాన్ని అమెరికా వదులుకున్నందుకు ట్రంప్ చాలా కాలంగా బైడెన్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూనే ఉన్నారు. చైనాకు సమీపంలో ఉన్న ఈ వాయుసేన స్థావరాన్ని కోల్పోవడం అమెరికాకు నష్టమని అన్నారు. ఇక గురువారం బ్రిటన్ పర్యటన సందర్భంగా ట్రంప్ బాగ్రామ్ ఎయిర్ బేస్ అంశాన్ని ప్రస్తావించారు. ఈ బేస్‌ను నిర్మించిన అమెరికాకు మళ్లీ దాన్ని తిరిగి అప్పగించాలని అన్నారు. 2021లో అఫ్ఘానిస్థాన్ తాలిబాన్‌ల హస్తగతమైన నేపథ్యంలో అమెరికా సేనలు బాగ్రామ్ ఎయిర్‌బేస్‌ను వీడాయి. అమెరికా హయాంలో ఈ వైమానిక స్థావరం అనేక ప్రత్యేకతలను సొంతం చేసుకుంది. 2010లో అఫ్ఘానిస్థాన్‌పై అమెరికా పట్టు ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు ఈ స్థావరంలో చిన్న టౌన్ వలె సకల సౌకర్యాలను ఏర్పాటు చేశారు. బర్గర్ కింగ్స్ కూడా ఇక్కడ ఓ స్టాల్‌ను తెరిచింది.

## ప్రత్యేక దేశంగా పాలస్తీనా గుర్తించి యుకే, కెనడా దేశాలు



లండన్: చారిత్రక పరిణామం చోటుచేసుకుంది. పాలస్తీనాను ప్రత్యేక దేశంగా యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా ఆదివారం నాడు అధికారికంగా గుర్తించాయి. పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ నుంచి వ్యతిరేకత ఎదురైనప్పటికీ యూకే, కెనడా ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మధ్యప్రాశ్చంలో సుస్థిర శాంతి నెలకొనేందుకు ద్విదేశ విధానానికి ఒట్టావా మద్దతిస్తోందని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రాంతంలో శాంతిభద్రతలకు 'సార్వభౌమాధికార, ప్రజాస్వామ్య, సుస్థిర పాలస్తీనా' ఏర్పాటు కీలకమని పేర్కొంది.

హమాస్, ఇజ్రాయెల్‌పై విమర్శలు

హమాస్, టెల్ అవివ్‌పై కెనడా పీఎం కార్యాలయం విమర్శలు గుప్పించింది. ఇజ్రాయెల్‌లో హమాస్ భయోత్పాతం సృష్టిస్తే, గాజా ప్రజల 'అణచివేత'కు ఇజ్రాయెల్ పాల్పడిందని పేర్కొంది. అక్టోబర్ 7 దాడిలో బందీలుగా పట్టుకున్న వారిని విడుదల చేయాలని హమాస్‌కు విజ్ఞప్తి చేసింది. పాలస్తీనా స్థాపనను నిరోధించేందుకు టెల్ అవివ్ ఒక పద్ధతి ప్రకారం పనిచేస్తూ వచ్చిందని విమర్శించింది. గాజాలో వేలాది మంది పౌరులను హతమార్చి, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించిందని తప్పుపట్టింది. ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో నిర్దేశించిన ప్రాథమిక మానవ హక్కులు, కెనడా దశాబ్దాలుగా అనుసరిస్తున్న నిలకడైన విధానానికి అనుగుణంగా పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నట్టు ప్రకటించింది.

శాంతి దిశగా..

పాలస్తీనా, ఇజ్రాయెల్‌లో శాంతి నెలకొంటుందనే ఆశాభావంతో పాలస్థీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నట్టు బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. మధ్యప్రాశ్చంలో శాంతి నెలకొనేందుకు ద్విదేశ విధానం అవసరమని తెలిపారు. ద్విదేశ విధానంతో ఇజ్రాయెల్ సురక్షితంగా ఉండటంతోపాటు సుస్థిర పాలస్తీనా సాధ్యమని అన్నారు.

## కాశ్మీర్‌పై పాత పాటే



లండన్: పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ (%హ్హష్ట్రవఋఝఓ రాష్ట్రుతీఅట%) మరోసారి కశ్మీర్ (%ఖఋంష్ట్రఎఅతీ%) అంశంపై విషం కక్కారు. కశ్మీర్ సమస్య పరిష్కారమైతేనే భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు సాధారణ స్థితికి వస్తాయని అన్నారు. కశ్మీర్ సమస్యను గాజాలో పరిస్థితితో పోల్చే ప్రయత్నం చేశారు. లండన్‌లో ఓవర్సీస్ పాకిస్థాన్ కమ్యూనిటీని ఉద్దేశించి షెహబాజ్ మాట్లాడుతూ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇరుప్రాంతాల్లో శాంతి స్థాపనకు భారత్ చొరవ చూపాల్సి ఉంటుందని అన్నారు.

'భారత్, పాక్ ఇరుగుపొరుగు దేశాలు. కలిసి మెలిసి జీవనం సాగించాల్సి ఉంటుంది. అయితే కశ్మీర్ అంశం పరిష్కారమయ్యేంత వరకూ ఇరుదేశాల సంబంధాల్లో సాధారణ పరిస్థితి నెలకొనడం సాధ్యం కాదు. కశ్మీర్ ప్రజల రక్తం వృథా కారాదు' అని షెహబాజ్ అన్నారు. కశ్మీర్ అంశం పరిష్కారం కాకుండా ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పవచ్చని ఎవరైనా నమ్మితే వాళ్లు 'ఫూల్స్ ప్యారడైజ్'లో విహరిస్తున్నట్టేనని పేర్కొన్నారు.

నాలుగు యుద్ధాలు చేశాం..

కశ్మీర్ సమస్యపై నాలుగు యుద్ధాలు చేశామని, ఇందుకోసం లక్షలాది డాలర్లు ధారపోసామని, ఆ నిధులను పాకిస్థాన్ ప్రజల అభివృద్ధి, అభ్యున్నతికి ఉపయోగించి ఉండొచ్చని వ్యాఖ్యానించారు. పొరుగుదేశానికి సహకరించడానికి బదులు పోరాట వైఖరినే ఇండియా ప్రదర్శిస్తోందని తప్పుపట్టారు. 'ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సింది మనమే. మనం శాంతిగా జీవనం సాగించాలా, పోరాటం కొనసాగించాలా?. అయితే పరస్పర ప్రేమ, పరస్పర గౌరవంతో జీవించాలన్నదే మన అభిమతం' అని షెహబాజ్ అన్నారు.

కశ్మీర్ అంశంపై మాట్లాడుతూనే గాజాలో ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాన్ని షెహబాజ్ ప్రస్తావించారు. 'గాజాలో 64,000 మంది ప్రజలు ప్రాణత్యాగాలు చేశారు. వారికి ఆహారం, నిత్యావసరాలు నిలిచిపోయాయి. కనీసం బతుకుతెరువు కోసం సంపాదించుకునే వీలు కూడా వారికి లేదు' అని అన్నారు.

మేకార్తి దినపత్రిక

25- 09 - 2025 గురువారం

## మహిళల చట్టాల గురించి అవగాహన




మేకార్తీదినపత్రిక సెప్టెంబర్ 24
కొమురవెల్లి ప్రతినిధి కర్రోళ్ల నవజీవన్
కొమురవెల్లి టెంపుల్ ఆవరణలో భక్తులకు మహిళలకు, యువకులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి సైబర్ నేరాల గురించి, గంజాయి ఇతర మత్తు పదార్థాల గురించి, చైన్ స్నాచింగ్ దొంగతనాల గురించి అవగాహన కల్పించిన కొమురవెల్లి ఎస్ఐ రాజు, హుస్నాబాద్ షీటీమ్ బృందం
కొమురవెల్లి ఎస్ఐ రాజు, మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి మాసపోవద్దని సూచించారు. ఎవరికి పడితే వారికి రూములు కిరాయికి ఇచ్చి మోసపోవద్దన్నారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి, అపరిచితుల వ్యక్తుల మాటలు నమ్మవద్దు, మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం, ఒంటరిగా వెళ్లేటప్పుడు వంటిపై బంగారం ఉంటే దొంగతనం జరిగే అవకాశం ఉంటుంది జాగ్రత్త పడాలి మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మరియు అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీమ్ నెంబర్ 8712667434 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుంది.
ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు ప్రశాంతి, స్వప్న కానిస్టేబుళ్లు కృష్ణ, బాబు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు

## స్వస్త్ నారి స్వ సక్త్ పరివార్ అభియాన్

వైద్య ఆరోగ్య శాఖ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వస్త్ నారి స్వ సక్త్ పరివార్ అభియాన్ 17 సెప్టెంబర్ నుండి అక్టోబర్ 2 వరకు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ప్రభుత్వ ఆసుపత్రులలో, గ్రామీణ ఆరోగ్య ఉప కేంద్రాలు మరియు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లలో నిర్వహించే వైద్య శిబిరాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ రజిత రాజన్న సిరిసిల్ల ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబం అనే కార్యక్రమం ప్రత్యేక వైద్య నిపుణులతో నిర్వహించే వైద్య శిబిరాలను తనిఖీ నిర్వహించినారు. ఈ తనిఖీలలో ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి మరియు వెంకటాపురం ఆరోగ్యం ఉపకేంద్రాలలో వైద్య శిబిరం ను తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలించి మహిళలందరికీ ప్రాథమికంగా హిమోగ్లోబిన్, మూత్రము, షుగరు, రక్త పోటు పరీక్షలు నిర్వహించి, తగిన చికిత్స అందించి మహిళలను ఆరోగ్య కరమైన సమతుల పోషకా ఆహారము మరియు వ్యక్తిగత పరిసరాల, పరిశుభ్రత పై చైతన్యవంతులు చేయాల్సిందిగా సిబ్బందికి సూచించినారు. ఈ కార్యక్రమంలో



ఆర్ బి ఎస్ కే డాక్టర్ నహిమ మరియు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మైనారిటీ మహిళ పథకం



మేకార్తీ దినపత్రిక సెప్టెంబర్24
చేర్యాల ప్రతినిధి కర్రోళ్ల నవజీవన్.
చేర్యాల మండలం మరియు చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని మైనారిటీ వర్గాలకు తెలియజేయునది ఏమనగా తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం కోసం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనారిటీ వర్గానికి చెందిన ఫకీర్. దూదేకుల మరియు అట్టడుగు ముస్లిం వర్గానికి చెందిన వారికి 1.00.000.లక్ష. రూపాయల 100% సబ్సిడీతో కూడుకున్న లోన్లు మరియు ఇందిరమ్మ మైనారిటీ మహిళ యువజన పథకం ద్వారా మైనారిటీ మహిళలు మరియు వితంతువులు విడాకులు పొందిన మహిళలు ఒంటరి మహిళలకు మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 50వేల రూపాయలు ఆర్థిక సహాయం కోసం అర్హులైన మైనారిటీ లబ్ధిదారులు 06.10.2025. తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా చేర్యాల మండల మాజీ కో ఆప్షన్ నెంబర్ ఎండి . ఖాజా (చేర్యాల12వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి) తెలిపారు.

## చేర్యాల మున్సిపాలిటీ కి 15 కోట్ల నిధులు మంజూరు

### ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన కొమ్మూరి

మేకార్తీ దినపత్రిక సెప్టెంబర్ 24
చేర్యాల ప్రతినిధి కర్రోల్ల నవజీవన్.
చేర్యాల మున్సిపాలిటీ కి 15 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరి అయ్యాయని నిధుల మంజూరి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులకు జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరు ప్రతాపరెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల కోసం 10 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడం జరిగిందని అదనంగా ఐదు కోట్లు కలిపి 15 కోట్లు మంజూరు చేయడం హర్షనీయమని అన్నారు. అధికారంలోనికి వచ్చిన రెండు సంవత్సరముల లోపే పెండింగ్ లో ఉన్న సిసి రోడ్లు, భవన నిర్మాణాలకు కోట్లాది రూపాయలు మంజూరీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని అన్నారు. రానున్న రోజుల్లో పట్టణ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.



## మంద మరియమ్మకి నివాళులు అర్పించిన కృష్ణ మాదిగ

మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ 24
శాయంపేట ప్రతినిధి కర్రోళ్ల నవజీవన్.
పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పెద్దమ్మ మరియు ఎమ్మార్పీఎస్ డ్రైవర్ బాబు మాదిగ అమ్మమ్మ , దాదాపు 115 సంవత్సరాల వయస్సు కలిగిన మంద మరియమ్మ మరణించడం జరిగింది.
ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా శాయంపేటలోని వారి స్వగృహంలో మంద మరియమ్మ భౌతిక దేహానికి మంద కృష్ణ మాదిగ పూలమాల వేసి నివాళు లర్పించారు.
డ్రైవర్ బాబు తో పాటు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎం ఎస్ పి జాతీయ నాయకులు, సిద్దిపేట జిల్లా ఇంచార్జి మంద కుమార్ మాదిగ, పుల్ల శ్రీనివాస్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు, మంద రాజు మాదిగ, రాజరాపు దాసు, మంద బద్రి. తదితరులు పాల్గొన్నారు.



## చేనేత పారిశ్రామిక సహకార అభివృద్ధి కి ప్రజా ప్రభుత్వం కృషి



### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేనేత సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న విప్

మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ వేములవాడ
చేనేత పారిశ్రామిక సహకార అభివృద్ధి కి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు..బుధవారం వేములవాడ పట్టణంలో చేనేత పారిశ్రామిక సహకార సంఘం ఉత్పత్తి %డ%వినియోగదారుల సంఘం లిమిటెడ్ 78 వార్షిక 93 వ సర్వసబ్య సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు..
వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు..నేత కార్మికులకు గడిచిన పదేళ్ల కాలంగా ఉన్న బకాయిలను ప్రజా ప్రభుత్వం విడుదల చేస్తుందని అన్నారు. నేత కార్మికుల కోరిక మేరకు లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేసమని అన్నారు. నేతన్న చేయూత, నేతన్న బీమా వంటి అనేక పథకాల బకాయిలు జమ చేస్తున్నామని అన్నారు.
వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేసి ఇప్పటివరకు 2,500 మెట్రిక్ టన్నుల నూలు దారం వంద సొసైటీలకు అందించామని అన్నారు.
వస్త్ర పరిశ్రమలో ఆధునిక సాంకేతికతను పెంచేందుకు హ్యాండ్లూమ్ యూనివర్సిటీ, ఐఐహెచ్‌టి ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు.

## లింగారావు చిత్రపటానికి ఇవాళ అర్పించి కుటుంబ సభ్యులకు

## ప్రగాఢ సానుభూతి తెలిపిన బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట ఆగయ్య

మేకార్తి దిన పత్రిక సెప్టెంబర్ ముస్తాబాద్
ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామనికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ చీటీ వెంకటనర్సింగరావు తండ్రి చీటి లింగారావు అనారోగ్యంతో మరణించిగ వారి చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట ఆగన్న మరియు సెస్ చైర్మన్ చిక్కాల రామారావు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంభాల మల్లారెడ్డి, కొమ్ము బాలయ్య, కేటీఆర్ పిఏ దాసరి గన్రాజు మరియు పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తాటాకర్ల ప్రభాకర్ బిఆర్ఎస్. పార్టీ సీనియర్ నాయకులు ఎదునూరి శ్రీనివాస్. కేటీఆర్ సేన ముస్తాబాద్ మండల అధ్యక్షులు వంగూరి దిలీప్. కేటీఆర్ సేన గ్రామ అధ్యక్షులు చెక్కపెల్లి వెంకటేష్ బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు పుల్లూరి సంతోష్ వెంకటేష్ బి ఆర్ఎస్ పార్టీ యూత్ ఉపాధ్యక్షులు పొందుర్తి పవన్ కళ్యాణ్ ప్రధాన కార్యదర్శి కోడూరి మనిష్ నాయకులు వసంత్ హరీష్ పాల్గొన్నారు.



## తెలంగాణ ఉన్నంత విద్యా మండలి చైర్మన్‌కి పిర్యాదు


**ప్రభుత్వా నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న. జ్యోతిష్మతి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి**

**యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి. జ్యోతిష్మతి విద్యాసంస్థలపై ప్రత్యేక అధికారిని నియమించి విచారణ చేపట్టాలని**




మేకార్తీ దినపత్రిక సెప్టెంబర్ కరీంనగర్
తెలంగాణ ఉన్నత విద్యా మండలికి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్.పి.ఐ) రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్. జ్యోతిష్మతి విద్యాసంస్థలపై విచారణ చేపట్టాలని ప్రత్యేక అధికారిని నియమించి విచారణ జరిపించాలని. ఫీజు రీయింబర్స్ మెంట్ మరియు స్కాలర్షిప్ సంబంధించిన నిధులను విచారణ చేపట్టిన తర్వాతనే కాలేజీకి. విద్యాసంస్థలకు నిధులు విడుదల చేయాలని ఈ యొక్క వినతిపత్రంలో కోరారు. ప్రభుత్వాకి నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలు నడుస్తున్నాయి జ్యోతిష్మతి కాలేజీలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థులను వేధిస్తున్నారని ఫీజుల పేరుతో పరీక్షలు రాయినియకుండా ఫ్రీ సీటు వచ్చినా విద్యార్థులను నుండి డబ్బులు వసూలు చేసినారని వెంటనే జ్యోతిష్మతి విద్య సంస్థల యజమానిపై చర్యలు తీసుకొని జైలుకు పంపాలని అన్నారు. నకిలీ ప్రొఫెసర్లతో కాలేజీలు నడిపిస్తున్నారని వెంటనే విచారణ అధికారిని నియమించి విచారణ చేపట్టిన తర్వాతే ఇట్టి జ్యోతిష్మతి విద్యాసంస్థలకు నిధులు విడుదల చేయాలని కోరారు.
వినతిపత్రం ఇచ్చిన వారిలో తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు పెమసారం కృష్ణ. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్.పి.ఐ) కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కాశిపాక అజేయ్ పాల్గొన్నారు..

## పూర్తయిన రిజర్వేషన్ల ప్రక్రియ



ముస్తాబాద్ మండలంలో 22 గ్రామపంచాయతీలకు బీసీ సామాజిక వర్గానికి 9,ఎస్సీసామాజిక వర్గానికి 6, ఎస్టీ సామాజిక వర్గానికి ఒకటి,జనరల్ ఆరు 6గా నిర్ణయించడం జరిగింది.
జడ్పిటిసి బిసి సామాజిక వర్గానికి,ఎంపీపీగా ఎస్సీ సామాజిక వర్గాన్ని కేటాయించడం జరిగింది.
ఎంపిటిసి రిజర్వేషన్లు మండలంలో ఉన్న 13 స్థానాలకు బీసీ సామాజిక వర్గానికి 5,ఎస్సీ సామాజిక వర్గానికి మూడు,%ూ% సామాజిక వర్గానికి ఒక్కటి,జనరల్ కేటగిరికి నాలుగు కేటాయించడం జరిగింది. పై రిజర్వేషన్లు వివిధ గ్రామాల జనాభా ప్రాతిపదికన తీసుకోవడం జరిగింది. అధికారులు తెలియజేయడం జరిగింది....

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Pri- ted at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com